క్లుప్తంగా

నాయకుల పరామర్శ

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కురుమయ్య మృతి చెందారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు డా. పగిడాల శ్రీనివాసులు శనివారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట గోపాలకృష్ణనాయుడు, జింకల శ్రీనివాస్, చంద్రమన్యం, బాలస్వామి, రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గోపాల్‌పేట: మండలంలోని మున్ననూరు గ్రామానికి చెందిన కావలి గోవిందు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం దీరుమల్లు సత్యశిలారెడ్డి ద్వారా ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి సాయంగా రూ.5వేల పంపించారు. స్థానిక నాయకులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈదమ్మగడ్డకాలనీలో కృష్ణయ్య, హనుమాండ్లగడ్డ కాలనీలో యశ్వంత్‌కుమార్ మృతిచెందాడు. కర్రోళ్ల స్వప్నభాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు సాయం అందజేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



మదనాపురం: సరళసాగర్ జలాశయంలో చేపల వేటకు వెళ్లి పి.శేఖర్ ప్రమాదవశాత్తు మునిగిపోవడం దురదృష్టకరమని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రకటించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శనివారం ఘటనాస్థలంలో గాలింపు చర్యలను సమీక్షించారు. మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌చైర్మన్ ప్రశాంత్ పాల్గొన్నారు.

గ్యార్వీ ఉత్సవాలు ప్రారంభం

అమరచింత: ముస్లిం క్యాలెండర్ ప్రకారం గ్యార్వీ నెల ప్రారంభం పురస్కరించుకుని మండలంలోని అన్నిగ్రామాల్లో ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. హజరత్ మహబూబ్‌ఉస్సేనీ దర్గాషరీఫ్‌లో ఉర్సోత్సవాల్లో విద్యుత్‌దీపాలతో అలంకరించారు. శుక్రవారం రాత్రి గంధం, శనివారం కందూర్‌లతో వేడుకలను ప్రారంభించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆత్మకూర్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలైన సంఘటన శనివారం రాత్రి ఆత్మకూర్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెబ్బేరు మండలం కంభాళాపురం గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి ఆత్మకూర్‌లోని కేబీఎస్ బ్యాంకులో ఎగ్రికల్చర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని తనబైక్‌పై వెళ్తుండ గా చెరువుకట్ట సమీపంలోని వై జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రైవేట్ వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లాఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: పెబ్బేరు వైపు నుంచి బైక్‌పై వస్తూ తిరుమలయ్య గుట్ట సమీపంలో కింద పడి శనివారం రాత్రి వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన అశోక్‌యాదవ్ పెబ్బేరు వైపు నుంచి బైక్‌పై వస్తుండగా, తిరుమల్లయ్యగుట్ట సమీపంలో రోడ్డు పక్కన కిందపడి పోవడం చూసిన వ్యక్తులు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని చెప్పారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

మలుపులు ప్రమాదాలకు పిలుపులు



బుద్దారంగండి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు (ఫైల్)

- సూచికబోర్డులు ఏర్పాటు చేసినా వృథా
- వాహనదారులకు తప్పని తిప్పలు
- నివారణ చర్యలు కోరుతున్న ప్రజలు

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. వీటి నివారణకు ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా కేవలం వారు వనపర్తి నుంచి గోపాల్‌పేట వరకు అక్కడక్కడా మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేశారు. కానీ వాటివల్ల ప్రయోజనం లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సంవత్సర కాలంగా ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ఎన్నో వాహన ప్రమాదాలు ఈ మలుపుల వద్దే చోటుచేసుకున్నాయి. కానీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గోపాల్‌పేట నుంచి ఏదుట్ల, ఏదుల వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేశారు. కాగా ఇప్పటివరకు అవసరమైన చోట సూచికబోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదం ఎప్పుడు జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో వనపర్తి జెర్రిపోతుల మైసమ్మ దగ్గరినుంచి గోపాల్‌పేట వరకు గోపాల్‌పేట నుంచి ఏదుల వరకు, గోపాల్‌పేట నుంచి బుద్దారం శివారు వరకు బీటీ రోడ్డు ఉంది. సుమారు ఆరునెలల క్రితం వనపర్తి నుంచి గోపాల్‌పేట వరకు అక్కడక్కడా సూచికబోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గొల్లోనిమిట్ట వద్ద సూచికబోర్డు ఏర్పాటు చేశారు. అది రోడ్డు కిందకు ఉండటం బోర్డుకు చెట్టు అడ్డంగా ఉంది. ఈ మలుపువద్ద ఇటీవల బస్సుకిందకు బైక్ దూసుకెళ్లి అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందాడు. అలాగే బుద్దారం గండి సమీపంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని వాహనదారులు ఎంతోమంది తీవ్ర గాయాల ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గోపాల్‌పేట నుంచి ఏదుట్ల గ్రామంలోకి వెళ్లే మలుపువద్ద ఇటీవల ఓ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ ప్రభుత్వ ఉద్యోగురాలు కాలు పూర్తిగా ఊడి కింద పడిపోయింది. అలాగే ఏదుల వెళ్లే దారిలో సైతం మలుపు ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకుని ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



ఏదుట్ల సమీపంలో నూతనంగా సూచికబోర్డు లేకుండా ఏర్పాటు చేసిన బీటీరోడ్డు (ఫైల్)

నివారణకు చర్యలు తీసుకోవాలి..



రోడ్లపై వాహనాదారులు ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు తీవ్ర గాయాలపాలు అవుతున్నారు. మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవి వాహనదారులకు కనిపించేలా చర్యలు తీసుకోవాలి. వాహనదారులకు అధికారులు అప్పుడప్పుడూ అవగాహన కల్పించాలి.

–విష్ణు, గోపాల్‌పేట

నెమ్మదిగా వెళ్లాలి..



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించడం లేదు. హెల్మెట్ ఉన్నా వాహనాలకు తగిలించుకుంటున్నారు కానీ తలకు పెట్టుకోవడంలేదు. మలుపులు వచ్చిన దగ్గర వాహనాన్ని స్పీడ్ తగ్గించుకుని వెళితే ప్రమాదాలు చోటుచేసుకోవు. మేము ఎప్పటికప్పుడు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం కానీ నిబంధనలు పాటించడం లేదు. వాహనదారులు మద్యం తాగినప్పుడు వాహనం నడపకుండా ఉండాలి. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.

–నరేష్‌కుమార్, ఎస్సై గోపాల్‌పేట

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి విజయరాములు

ఆత్మకూర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి పరిష్కరించుకున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐ పార్టీకి ప్రజల తరఫున మద్దతు లభిస్తోందని, అన్ని స్థానాల్లో పోటీచేసి గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మీనారాయణశెట్టి, జిల్లా నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, రాబర్టు, మోషా, బాలరాజు, బాలకృష్ణ, లింగన్న, రమేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత పాలమూరు టీం

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామంలో విజయదశమి సందర్భంగా గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీలో పాలమూరు మధు టీం విజేత, రన్నర్‌గా పాలమూరు నబీ జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు శనివారం నగదు బహుమతులు, షీల్డులను అందజేశారు. విజేతజట్టుకు బీజేపీ నాయకులు అన్వేష్, కరెంట్ రామకృష్ణ ఆర్థికసాయంతో రూ.20వేల నగదు, రన్నర్ జట్టుకు మీనిగ శంకర్ రూ.10వేలు ఆర్థికసాయం, షీల్డులను అందజేశారు. క్రీడాపోటీలకు ఆర్థికసాయం అందజేసిన నాయకులకు, క్రీడా అభిమానులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

కార్యక్రమంలో అడ్వకేట్ రవికుమార్, అన్వేష్, రమేష్, శ్రీనివాస్‌నాయుడు, మల్లేష్, పరమేష్, రామకృష్ణ, రవి, అంజి, చందూగౌడ్, విక్రమ్, కుమార్, సంతోష్, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా నిరంజన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్‌కట్‌చేసి సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఖిల్లాఘనపురం: వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో బస్టాండ్‌వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దఅంజనేయుల్‌గౌడ్, చిన్న అంజనేయులుగౌడ్, బెస్త గోపాల్, అంజిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, గొడుగుసత్యం, బుచ్చిబాబుగౌడ్, రాములు, సింగోటం, నరేందర్, చెన్నయ్య, యాదయ్య, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయ ఆలయానికి మాజీమంత్రి విరాళం

పాన్‌గల్: మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రామాంజనేయ ఆలయ నిర్మాణానికి మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి రూ.10లక్షలు విరాళంగా ప్రకటించారు. నిరంజన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా శనివారం కొత్తపేట సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆలయ కమిటీసభ్యులు మాజీ మంత్రిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణంకు భాగస్వాములు కావాలని మాజీ మంత్రిని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి తనవంతు సహకారంగా రూ.10లక్షల అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలస్వామి, మాజీ ఎంపీటీసీ రాంచందర్‌యాదవ్, కమిటీ సభ్యులు రాముయాదవ్, రమేష్‌రెడ్డి, కుమ్మరిచంద్రయ్య, బాలవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పరుశరామ్, రవికుమార్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బురదలో నడిచేదెలా..?



పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పాన్‌గల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న రోడ్డుపై వరదనీరు నిల్వతో స్టేషన్‌కు వెళ్లే జనంతో పాటు స్టేషన్ సమీపంలోని కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలో గుట్ట నుంచి వరదనీరు, సమీపకాలనీ నుంచి మురుగు అంతా కూడా రోడ్డుపైనే నిల్వ ఉండడంతో నడిచేందుకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ రోడ్డు ఉన్న డ్రైనేజీని నిర్మించకపోవడంతో రోడ్డుపైనే నీరునిలిచి తమ కాలనీకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శికి విన్నవించి రోడ్డుపై నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు పలుమార్లు పంచాయతీ కార్యదర్శి కోరినా స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండలస్థాయి అధికారులైనా స్పందించి రోడ్డుపై నీరు నిల్వలేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నడిచేందుకు వీలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చెరువులో ట్రాన్స్‌ఫార్మర్



ఎస్సీ కాలనీ సమీపంలో చెరువునీటిలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పాన్‌గల్: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో దామచెరువులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. విద్యుత్ స్తంభాలు చెరువు నీటిలో ఉండటం, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. చెరువు నీటిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలని పలుమార్లు కాలనీ వాసులు విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై గేదె మృత్యువాత పడిందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం చోటు చేసుకోకముందే చెరువునీటిలో ఉన్న స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను షిఫ్ట్ చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు

గోపాల్‌పేట: అభివృద్ధి కార్యక్రమాలు చూసి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు ప్రారంభమయ్యాయని స్థానిక పార్టీ ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశిలారెడ్డి తెలిపారు. శనివారం మండలకేంద్రానికి చెందిన మండ్ల ఆంజనేయులు ఆయన భార్య కొందరు శనివారం ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరుతున్నారని పేర్కొన్నారు.

యువజన సంఘం కార్యవర్గం ఎంపిక



ఖిల్లాఘనపురం: మండలంలోని అప్పారెడ్డిపల్లి చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రాత్రి ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు మహేష్ తెలిపారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం దగ్గర మధ్యరాత్రి వరకు జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో గ్రామపెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షుడిగా గుంపలి మహేష్, ఉపాధ్యక్షుడిగా గుంపలి రాఖేష్, ప్రధాన కార్యదర్శిగా పూజారిచింటు, సహాయ కార్యదర్శిగా పసుల కల్యాణ్, కోషాధికారిగా గుంపలి శివకుమార్ ఎంపిక య్యారు. వీరితో పాటుగా కార్యవర్గ సభ్యులుగా గొడుగు బాలరాజు, గౌరిపాగరాజు, మారెపల్లి వెంకటేశ్, బెన్ని స్వామి, అనెమోని రవి, నాగేష్‌గౌడ్, జంగం భాస్కర్, కనివెట్ట శివలను సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

గుట్టుగా మట్టి తరలింపు



మదనాపురం ఎర్రగట్టు వద్ద జేసీబీతో మట్టి తరలిస్తున్న దృశ్యం

- అనుమతులు లేకుండా మట్టి తరలింపు

మదనాపురం: మండలంలోని ఎర్రగట్టు ప్రాంతంలో కొంతమంది వ్యాపారులు ఆదివారం సెలవు దినాలను ఆసరాగా చేసుకుని అక్రమంగా గుట్టలను తవ్విస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మట్టి అవసరం ఉందన్న నెపంతో పెద్దసంఖ్యలో ట్రాక్టర్లను ఉపయోగించి గుట్టల తవ్వకాన్ని కొనసాగిస్తున్నారు. 25 ట్రాక్టర్‌తో మట్టి తరలింపు జరిగింది. గుట్ట తవ్వకానికి జేసీబీ కూడా ఏర్పాటు చేశారు. భౌగోళిక నిబంధనలకు, పర్యావరణ నియమాలకు విరుద్ధమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది పర్యావరణ నాశనానికి దారితీసే చర్య అంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారు పలుమార్లు మండల అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు చేపట్టలేదని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం, గుట్టల తవ్వకానికి జిల్లా అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఇక్కడ అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మట్టి తవ్వకాలు అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతి ఉంటేనే తరలించాలి

మండలంలో అనుమతులు లేకుండా సమాచారం లేకుండా మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇందిరమ్మ ఇళ్లకు అవసరముంటే మేమే అనుమతులు ఇస్తాం. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– జీకే మోహన్ తహసీల్దార్, మదనాపురం

అమ్మా.. ఆశీర్వదించు



ఆత్మకూర్‌లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమతో ఊరేగింపు



ఆత్మకూర్‌లో ఆధ్వర్యంలో పోతురాజుల విన్యాసాలు

ఆత్మకూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని 11రోజుల పాటు విశేష పూజలు అందుకున్న అమ్మవారిని శనివారం రాత్రి ఊరేగింపు నిర్వహించి వీడ్కోలు పలికారు. వాసవీ కన్యకాపరమేశ్వరి స్వర్ణకారుల కేశవనగర్‌లో, నీలకంఠేశ్వర స్వామి కోట్లఆంజనేయస్వామి, బాలబ్రహ్మేశ్వరస్వామి, వాల్మీకీనగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు విగ్రహాలను మేళతాలలతో భాజభజంత్రీలు, బొడ్డెమ్మలతో, పలుకలకోళ్లు, చిన్నారుల కూచిపూడినాట్యం, పోతురాజుల విన్యాసాలతో పట్టణ పురవీధులగుండా ఊరేగించారు.

అమరచింత: దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవం నిర్వహించారు. గణేష్‌నగర్ వెంకటేశ్వర భవానిమాత ఆలయంలో దుర్గామాతను పట్టణ పురవీధుల గూండా ఊరేగించారు. అదేవిధంగా ఆరెకటికల ఆధ్వర్యంలో బతుకమ్మ పాటలతో ఊరేగిస్తూ నిమజ్జనం తరలించారు.

వనపర్తి రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చిట్యాల గ్రామంలో శనివారం అమ్మవారిని శోభాయాత్రలో ఆటపాటలతో పురవీధుల్లో ఊరేగించారు.

ఖిల్లాఘనపురం: మండలకేంద్రం కుర్వగేరి శివాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనం కార్యక్రమాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. 11రోజుల పాటు నిత్యపూజలు అందుకున్న అమ్మవారు రోజుకు ఓ అవతారంలో భక్తులు అలంకరించారు. అనంతరం రాత్రి 9గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో అమ్మవారిని ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో బొడ్డెమ్మ, యువకులు డప్పులకు అనుగుణంగా నృత్యాలు చేశారు.



చిట్యాలలో అమ్మవారి ఊరేగింపు



ఖిల్లాఘనపురంలో దుర్గామాత ఊరేగింపులో బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు



అమరచింతలో దుర్గామాత విగ్రహంతో నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



ఆత్మకూర్‌లో బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో..

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



వీపనగండ్ల: వరిపంటలో ఆకుముడత, సుడిదోమ నివారణ కోసం వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని వరి పంటలను ఆయన పరిశీలించారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాదారులను ఆశ్రయించడం వల్ల రైతులు అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని శాస్త్రీయ పద్ధతిలో గ్రామాల్లోని ఏఈఓల సూచనలను పాటిస్తూ వారు సిఫారస్ చేసిన మందులనే వినియోగించుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.